* పోస్టాఫీసులో మర్చిపోయిన డిగ్రీ సర్టిఫికేట్ వున్న ఫైల్, గంటన్నర తర్వాత గుర్తొచ్చి వెళ్ళి చూస్తే కనబడటం.

— ఓ నిరుద్యోగి

* పక్కింటివాళ్ళు నేను నిద్రలేచేలోగా ఆంధ్రభూమి శుక్రవారం సంచికని చదివి, పేజీలని యథాతథంగా అమర్చి, నలగకుండా తిరిగి మా ఇంట్లో ఇవ్వడం.

— మల్లాది

# పెళ్ళికాని అమ్మాయిలకి మాత్రమే

ఇదివరకటి రోజుల్లో పిల్ల పెద్దమనిషి కాకుండా పెళ్ళిళ్ళు చేసేవారు. తర్వాత ఇరవై ఏళ్ళు మించకుండా వివాహం చేసేవారు. ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకి పాతికేళ్ళు వచ్చినా వివాహం చేయలేకపోతున్నారు. కొందరు ఆడపిల్లలు తమ భర్తలను తామే వెదుక్కోవాల్సిన పరిస్థితి కూడా వచ్చేసింది.

"కట్నం యివ్వలేం, మన శాఖవాడు కాకపోయినా ఫర్వాలేదు. కాని మన కులం వాడెవడు నిన్ను పెళ్ళి చేసుకుంటానన్నా, నీకు నచ్చితే మాకు నచ్చినట్లే" అని తమ కూతుళ్ళతో అన్న తల్లితండ్రులు నాకు తారసపడ్డారు.

"ప్రేమ కట్నం కోరదు" అన్నది కొన్ని సందర్భాల్లో నిజం అవుతోంది. తెలివయిన అమ్మాయి పెళ్ళి చేసుకోవాలని చూస్తే, తెలివిగల అబ్బాయి పెళ్ళిని ఎవాయిడ్ చేయడానికి చూస్తాడు.

ఇంట్లో కూర్చుని టి.వి. చూసి వారపత్రికలు చదువుకునే బదులు కొందరమ్మాయిలకి 'మనమూ ప్రేమించి పెళ్ళి చేసుకుంటే పోలా?' అనిపించచ్చు. కాకపోతే వాళ్ళకి ప్రేమించడానికి అర్హుడయిన అబ్బాయి తారసపడకపోవచ్చు. ఒకవేళ తారసపడ్డా పరిచయం

ముందుకు ప్రొసీడ్ కాకపోవచ్చు. అంచేత అలాంటి అమ్మాయిలకి కొత్త అబ్బాయిలని పరిచయం చేసుకునే కొన్ని చిట్కాలు అవసరం అవుతాయి. అందుచేత కొన్ని సరదా చిట్కాలు.

అమ్మాయి అందంగా ఉంటే అబ్బాయిలే ఆమెతో పరిచయం చేసుకోడానికి ముందుకు వస్తారు. కాని అమ్మాయి అనాకారి కాని, లేదా సాధారణమయిన అందం గలది కాని అయితే అబ్బాయిల దృష్టిలో పెద్దగా పడదు. సో, అలాంటి వారు దీన్ని జాగ్రత్తగా చదివి కట్ చేసి దాచుకుని, అవసరం అనుకుంటే జెరాక్స్ తీసి తమ తోటి వాళ్ళకి కూడా పంపించవచ్చు.

ఇక్కడే, బ్రహ్మచారులయిన అబ్బాయిలకో సూచన. ఈ క్రింది ట్రిక్స్ మీమీద ఏ హోమ్లీబ్యూటినో ప్రయోగించవచ్చు. కాబట్టి కాస్త జాగ్రత్తగా ఉండండి. అవసరం అనుకుంటే మీరు కూడా వీటిని మీకు నచ్చిన అమ్మాయిమీద ప్రయోగించి ఆమెని పరిచయం చేసుకోండి. పరిచయమే ప్రేమకి, ప్రేమే ప్రణయానికి దారితీస్తుంది కదా మరి. ఇక పెళ్ళికాని అమ్మాయిలూ.... వీటిని శ్రద్ధగా చదివి ఫాలో అవండి. మాఘం దగ్గరవుతోంది. ఆల్ ది బెస్ట్.

1. మీకు నచ్చిన వుడ్‌బి దగ్గరకి పరిగెత్తికెళ్ళి వెనకనించి మెడ చుట్టూ చేతులు వేసి కౌగలించుకుని 'హలో రాహూరావు. ఇంత కాలం ఏమయ్యావు' అనండి.
2. సూపర్ మార్కెట్లో మీ వుడ్‌బికీ ఓ పాకెట్ చూపించి, దానిమీద రాసి ఉన్న ధర ఎంతో చూసి చెప్పమనండి.
3. క్యూలో మీ వుడ్‌బి వెనక నిలబడండి. అవసరం లేకపోయినా ఇట్టే మాటలు కలపచ్చు.
4. మీ 'వుడ్‌బి'ని ఏదయినా సహాయం అడగండి – పోస్టాఫీసులో తారసపడితే నెల్లూరు స్పెల్లింగ్, రోడ్డుమీద ఎదురయితే 'అయిదు కాగితం పడిపోయింది. కాస్త వెదుకుదాం' అనో.... ఇలా ఏదో ఒకటి.
5. పార్క్ బెంచీల్లో ఒంటరిగా సాయంత్రాలు కూర్చోండి. 'ఉడ్‌బి'

వచ్చి మీ పక్కన కూర్చోవచ్చు.

6. ఫ్రెంచ్ నేర్పే క్లాస్‌లోనో, కంప్యూటర్స్ నేర్పించే క్లాస్‌లోనో, టైప్ ఇన్‌స్టిట్యూట్‌లోనే చేరండి,
7. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కి హోటల్‌కి వెళ్ళండి. (బ్రహ్మచారులెవరు ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ చేసుకోరు)
8. మీ 'వుడ్‌బి' సిస్టర్‌తో పరిచయం చేసుకోండి. 'మీ అన్నయ్య బావుంటాడే' లాంటి కామెంట్స్ తరచూ చేస్తూండండి.
9. పబ్లిక్ లైబ్రరీకి తరచు వెళ్ళి కూర్చుంటుండండి (తస్మాత్ జాగ్రత్త. నిరుద్యోగి బ్రహ్మచారులు వాంటెడ్ కాలంస్ కోసం రాగలరు. షేర్ల కాలం చూసే వాళ్ళే ఉద్యోగం చేసే మగాళ్ళు)
10. మీ చిన్న తమ్ముణ్ణి తీసుకుని జెంట్స్ బార్బర్ షావ్‌కి కటింగ్ చేయించడానికి మీరే వెళ్తూండండి.
11. అతని ముందునించి వెళ్ళి మీ చేతి రుమాలుని పొరబాట్న పడినట్లుగా నేలజారవిడవండి (హేండ్ బేగ్ అయితే మీ 'వుడ్‌బి' డబ్బుకోసం కక్కుర్తిపడి పిలిచి ఇవ్వకపోవచ్చు కాబట్టి రుమాలే మంచిది)
12. అతగాడికన్నా ముందు నడిచి మీ హై హీల్ లోంచి ఓ కాలు తీసి రెండడుగులు వేసి పడుతున్నట్లు తూలండి.
13. మీ దగ్గరి బేంక్‌లో ఆకౌంట్ ఓపెన్ చేసి అయిదు రూపాయలు వేయడమో, తీయడమో తరచు చేస్తుండండి.
14. ప్రయాణం చేస్తేప్పుడు మీరు మోయగలిగిన దానికన్నా ఓ బేగ్‌ని అధికంగా తీసుకెళ్ళండి (సహాయానికి ఆ మొద్దు వెధవ రాకపోతే మీరు అడగండి)
15. అమెరికా నించో, గల్ఫ్‌నించే వచ్చేవాళ్ళతో చెప్పి పెర్‌ఫ్యూమ్ తెప్పించుకుని ఉపయోగించండి,
16. మీ 'వుడ్‌బి' చేతిని అందుకుని 'ఈ వాచి ఎంతో బావుంది. సరిగ్గా ఇలాంటిదే మా అన్నయ్యకి, నాన్నకి ప్రజెంట్ చెయ్యాలనుకుంటున్నాను' అనండి.

17. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో రాత్రిళ్ళు 'మెస్'కి వెళ్ళి భోజనం చేయండి. (అక్కడ ఉద్యోగాలుచేసే బ్రహ్మచారులే కష్టమర్స్)

18. కాలక్షేపానికి ఎక్కడికీ పుస్తకం తీసుకెళ్ళకండి.

19. మీ ఫ్రెండ్స్‌ని అడగండి వాళ్ళకి తెలిసిన బ్రహ్మచారులని మీకు పరిచయం చేయమని.

20. మీ పక్కింటి మేడమీది బ్రహ్మచారి గది తలుపు తట్టి ఓ కప్పు ఉప్పు అప్పు అడగండి.

21. మీ ఇంటిపక్క మేడమీది గదిలో 'వుడ్ బి' లేక పోతే. అతనున్న పక్కింటికి ఇల్లు మార్చండి.

22. జీతం కోసం కాకపోయినా ఉద్యోగంలో చేరండి

23. ఇంటింటికి వెళ్ళి లాటరీ టిక్కెట్లో బెనిఫిట్ షో టిక్కెట్లో అమ్ముతూ వుండండి.

24. 'స్థలం లేదా ఇల్లు అమ్మకానికి' అన్న ప్రకటనలోని టెలిఫోన్ నంబరుకి ఫోన్ చెయ్యండి. వివరాలడగండి. ఆస్తివి కావు. అతనివి. అవసరం అనుకుంటే మీ అడ్రస్ చెప్పి రమ్మనండి.

25. వర్షం మొదలవగానే బయటికి గొడుగు లేకుండా వెళ్ళి గొడుగున్న 'వుడ్ బి' కోసం వెదకండి.

26. సినిమా కెళ్ళినప్పుడు రెండు టిక్కెట్లు కొని రెండోది మీ 'వుడ్ బి'కి అమ్మండి, మీ ఫ్రెండ్ వస్తానని చెప్పి రాలేదని అబద్దం అడి.

27. ప్లే గ్రౌండ్‌కి సాయంత్రాలు వెళ్ళి వాళ్ళ బేడ్మింటన్, టెన్నిస్, క్రికెట్ లాంటి ఆటలు చూడండి. బంతి మీ వైపు రాగానే....

28. శుక్ర శని వారాల్లో సాయంత్రం గుడికి వెళ్ళి ఎక్కువ సేపుపుండండి.

29. పెళ్ళిళ్ళకి ఆహ్వానం వస్తే తప్పక వెళ్ళండి.

30. అలాగే సత్యన్నారాయణ వ్రతం, నామకరణం, ఉయ్యాల్లో వేయడం లాంటి శుభ కార్యాలకి ఆహ్వానం వచ్చినా తప్పక

వెళ్ళండి (ఏ ఇంట్లో ఏ పుడ్ బి ఉన్నాడో ఎవరికి తెలుసు)?

31. బొట్టు బిళ్ళని కొద్దిగా పక్కకి పెట్టుకుని మీ మొహం వంక చూసే 'పుడ్ బి'ని అడగండి ఎందుకలా చూస్తున్నారని.

32. బుక్ ఎగ్జిబిషన్స్, స్టాంప్స్ ఎగ్జిబిషన్స్, ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్స్. హోమ్‌నీడ్స్ ఎగ్జిబిషన్స్.... వేటినీ వదలకుండా వెళ్తూండండి.

33. స్కూల్ డే ఏనివర్సిరి ఫంక్షన్స్ అన్నింటికి వెళ్ళండి (పేపర్లో 'నగరంలో ఈ రోజు'లో ఇస్తుంటారు. ఆహ్వాన పత్రం లేక పోయినా రానిస్తారు).

34. లోకల్ ట్రెయిన్స్ ఈ చివర నించి ఆ చివరికి ఆఫీసు విడిచిపెట్టే టైంలో, రద్దీగా వున్న మగాళ్ల కంపార్టుమెంట్‌లో ప్రయాణం చేయండి.

35. మీ తండ్రి పెన్షన్ గురించి వాకబు చేయడానికి ఎ.జి. ఆఫీసుకో ఎల్.ఐ.సి. పాలసి గురించి ఎల్.ఐ.సి. ఆఫీసులకి ఏదో ఓ పని పెట్టుకుని వెళ్తూండండి.

36. తరచు మీ బంధు మిత్రులిళ్ళకి వెళ్ళి కొన్ని రోజులుంటూండండి.

37. రైలు లేదా బస్సు ప్రయాణాల్లో ఆఖరుగా ఎక్కండి. ఎవరి పక్కన సీటుంటే అతగాడే మీ 'పుడ్'బి అవచ్చుగా?

38. మీరుచదివిన పేపరే అయినా మీ 'పుడ్ బి' దగ్గర పేపరుంటే అడిగి తీసుకోండి.

39. గళ్ళ నుడికట్టు నింపుతున్నట్టు నటిస్తూ 'ప్రణయం అంటే ఏమిటి?' అని అడగండి.

40. మీరావూరికి కొత్తయినవారిలా నటించి 'ఫలానా చోటికి వెళ్ళా లంటే ఏ నంబరు బస్ ఎక్కాలి?' అని అడగండి.

41. లిఫ్ట్‌లో వెళ్తూ మీ 'పుడ్ బి' తో మీ బట్టలు ఎవరు సెలక్ట్‌చేస్తారో గాని బావున్నాయి' అని కాంప్లిమెంట్ చేయండి.

42. నడి రోడ్డు మీద 'పుడ్ బి'ని ఆపి మీరు 'సీత వాళ్ళ చిన్నన్నయ్య కదా?' అని అనుమానంగా చూస్తూ అడగండి.

43. ఈ 42 ట్రిక్స్ మీకు పని చేయకపోతే ఇక 'నన్ను పెళ్ళి చేసుకోవా?' అని డైరెక్ట్‌గాఅడిగేయండి. 43 వది ఇదొక్కటే మిగులుతుంది మీకు.

మీ 'శుభలేఖ' నాకు పంపడం మర్చిపోకండి. మీ లాంటి వాళ్ళని మీ పెళ్ళికి చాలామందిని పంపాలిగా మరి.

# సుందర వదనానికి చిట్కాలు

కొత్త సంవత్సరం వచ్చిందంటే చాలు. కొత్త వుత్సాహం, కొత్త నిర్ణయాలు, పాత సంవత్సరం మనకేం ఇచ్చింది, ఏం ఇవ్వలేదు అన్న ఆలోచనలు. చేద్దామనుకుని చెయ్యకుండా మిగిలిపోయినవి కొత్త సంవత్సరంలో చేయాలన్న తపన. బంధుమిత్రులకి గ్రీటింగ్స్‌ని శుభాకాంక్షలు తెలుపుతూ పంపటం కూడా కొత్త సంవత్సరం ముచ్చట్లలో ఒకటి.

ఈ సంవత్సరం నేను కొన్ని నూతన సంవత్సర నిర్ణయాలు తీసుకున్నాను. డైరీలో రాసుకునే బదులు పబ్లిక్ చేస్తే ప్రపంచానికి కూడా అవి తెలియజేసినట్లవుంది అని రాస్తున్నాను. ఇప్పుడు వీటిని ఆచరించడానికి చచ్చినట్లు ఇంకా స్త శ్రద్ధ వహించాలి నేను. ఎందుకంటే అందరికీ తెలిసిపోతుందిగా.

నేను ఎప్పటికన్నా అందంగా, సుందరంగా కనబడాలి అన్నది ఆ నిర్ణయం. అయితే హెడ్ అండ్ షోల్డర్స్ షేంపూ, గిల్లెట్ లెమన్ షేవింగ్ క్రీమ్, గార్డెన్ రోజ్ పెర్‌ఫ్యూమ్, రేమాండ్ సూటింగ్స్, అంబాసిడర్ బూట్లు, సెవెన్ సిస్ అఫ్టర్ షేవ్ లోషన్ లాంటివి చాలా కాలంగా వాడుతున్నవే. ఈసారి అందానికి కొత్త అలంకరణ సామగ్రిని ఎన్నుకున్నాను. నిజానికి ఇది ఏ వయసువారికయినా, ప్రపంచంలోని ఏ ప్రాంతానివారికయినా అందరికీ సమానంగా